సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

అలరించిన శ్రీవారి గీతాలాపన



గీతాలాపన చేస్తున్న నాగజ్యోతి బృందం

కొమ్మాది: బీచ్ రోడ్డు రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయం (టీటీడీ)లోని కళావేదిక వద్ద సోమవారం రాగ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గీతాలాపన అలరించింది. కె. నాగజ్యోతి సారథ్యంలో నిర్వహించిన గీతాలాపనలో 'పలుకే బంగారమాయెనా, అదివో అల్లదిలో..' గీతాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అన్నమయ్య కీర్తనలు, వేంకటేశ్వరస్వామి మహత్యంపై ఆలపించిన పాటలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి.

కార్పొరేషన్ రుణాల లబ్ధిదారుల ఎంపిక నేడు

భీమునిపట్నం: బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హుల ఎంపిక మంగళవారం జరుగుతుందని జోనల్ కమిషనర్ ప్రేమప్రసన్న వాణి తెలిపారు. జోన్ పరిధిలోని నాలుగు వార్డుల నుంచి రుణాల కోసం 1,525మంది నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారు ధ్రువపత్రాలు, జిరాక్స్ కాపీలతో భీమిలి తోటవీధి వద్దనున్న కల్యాణ మండపం వద్దకు ఉదయం తొమ్మిది గంటలకు హాజరు కావాలని తెలిపారు.

నేడు రాగుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

పద్మనాభం: మండలంలోని మద్ది రైతు సేవా కేంద్రంలో మంగళవారం రాగుల (చోడి)కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవీఎస్ చలం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు ఈ కేంద్రం ప్రారంభమవుతుందని తెలిపారు. క్వింటాకు రూ.4290 మద్దతు ధరను పౌర సరఫరాల సంస్థ చెల్లిస్తుందని పేర్కొన్నారు. తేమ 12 శాతం లోపు, వ్యర్థ పదార్థాలు, మట్టి రాళ్లు ఒక శాతం, ఇతర ఆహార ధాన్యాలు ఒక శాతం, దెబ్బతిన్న గింజలు ఒక శాతం, కొద్దిగా దెబ్బతిన్న గింజలు రెండు శాతం లోపు ఉండాలని పేర్కొన్నారు. ఈ–పంట నమోదు చేసుకున్న, ఈకేవైసీ చేసుకున్న రైతులు రాగులను తీసుకువచ్చి కొనుగోలు కేంద్రంలో అమ్మవచ్చని సూచించారు.

పైడితల్లమ్మ అనుపోత్సవం నేడు



రాజుల అలంకరణలో దాకమర్రి పైడితల్లమ్మ

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి పైడితల్లమ్మ వారి వార్షిక ఉత్సవాలలో భాగంగా మంగళవారం అనుపోత్సవం, రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దాకమర్రిలో అమ్మవారిని గాజులు, గజమాలలు, నిమ్మకాయల దండలతో అలంకరించారు. పండగ సందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. శింగనబంధ, నారాయణరాజుపేట, మజ్జిపేట పంచాయతీలలోనూ పైడితల్లమ్మకు మంగళవారం అనుపోత్సవాలు నిర్వహించనున్నారు.

కడుపునొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య

పీఎం పాలెం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. కాకినాడ సిటీకి చెందిన చిట్టిబూరి అప్పారావు (32) అవివాహితుడు. స్థానిక వుడారోడ్డులోని డీఆర్ ఫుడ్‌లో కుక్‌గా పని చేస్తున్న అప్పారావు, మధురవాడ రెవెన్యూ కాలనీలో నివసిస్తున్న అక్క గోపిశెట్టి రమణమ్మ ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈ నెల ఆరో తేదీ రాత్రి భోజనం చేసిన తర్వాత తన గదిలో నిద్రించాడు. 7వ తేదీ ఉదయం గది తలుపులు తెరవకపోవడంతో, బలవంతంగా తలుపులు తీసి చూడగా అప్పారావు చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉన్నాడు. మృతుడి అక్క పోలీసులకు సమాచారమిచ్చారు. అప్పారావు తరచూ కడుపునొప్పితో బాధ పడుతున్నాడని, ఆ నొప్పి భరించలేకనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

అన్న సమారాధన

తగరపువలస: కొత్త మూలకుద్దు సుత్తమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోస్తని తీరంలో ఉన్న అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు.

అంతిమయాత్రకు అవస్థలెన్నో..

- తాళ్లవలసలో శ్మశానవాటిక కబ్జా
- తాటితూరులో గెడ్డ, తుప్పలు దాటి వెళ్లాల్సిన దుస్థితి
- వలందపేట వాసులకు తీరని వెతలు



శ్మశానవాటికకు వెళ్లాలంటే ఈ గెడ్డ దాటాల్సిందే ..

తగరపువలస: వలందపేట వాసులను శ్మశానవాటిక కష్టాలు ఏళ్ల తరబడి వీడటం లేదు. జీవీఎంసీ రెండోవార్డు, భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీలలో కలసి ఉన్న ఈ గ్రామంలో ఎవరైనా మరణిస్తే, అంతిమ యాత్రకు బంధువులు, గ్రామస్తులు పడుతున్న వెతలు వర్ణనాతీతం.

తాళ్లవలస పంచాయతీలో సుమారు 70 సెంట్లు, తాటితూరు పంచాయతీలో 1.64 సెంట్లు పచ్చిక బయలును శ్మశాన వాటిక అవసరాలకు గతంలో కేటాయించారు. వాస్తవంగా వలందపేట గ్రామం జాతీయరహదారికి ఇరువైపులా విస్తరించి ఉంది. ఒకవైపు పూర్తిగా జీవీఎంసీలో, మరొక వైపు జీవీఎంసీ, మండలంలో రెండు భాగాలు విభజించబడింది. ఈ గ్రామంలో ఎవరైనా చనిపోతే దహన సంస్కారాలు చేయడానికి తాళ్లవలస పంచాయతీ పరిధిలో.. పూడ్చి పెట్టడానికి తాటితూరు పంచాయతీ పరిధిలోని పచ్చిక బయలుకు తీసు కుని వెళ్తారు. గ్రామం నుంచి శ్మశానవాటికకు వెళ్లేవరకు ప్రత్యేకంగా మార్గాలు లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులు దయతలచి కేటాయించిన మార్గంలోనే శ్మశానవాటికకు తీసుకువెళ్లాలి. చాలావరకు గ్రామానికి దూరంగా ఉన్న తాటితూరు పంచాయతీ పరిధిలో శ్మశానవాటికకే తీసుకువెళ్తారు.

తాళ్లవలసలో ఆక్రమణలు

తాళ్లవలస పరిధిలో శ్మశానవాటికను చాలావరకు కబ్జా చేసేశారు. మిగిలిన శ్మశానవాటికను కూడా ఇసుక కోసం తవ్వేయడంతో పాతి పెట్టిన మృతదేహాల అస్థిపంజరాలు బయట పడుతున్నాయి. దీంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఈ తుప్పలు దాటుకుని, మృతదేహాన్ని తీసుకువెళ్లాల్సిందే..



తాళ్లవలస పంచాయతీలో వసతులు లేని శ్మశానవాటిక

మార్గం నిర్మిస్తామని, లే అవుట్ వేసిన టీడీపీ

భీమిలిలో ఎక్కువసార్లు టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో గెడ్డపై మార్గం నిర్మించడానికి ఆసక్తి చూపలేదు. గతంలో ఇక్కడి గెడ్డపై మార్గం నిర్మిస్తామని తెలిపింది. కానీ గెడ్డను, శ్మశానవాటికను ఆనుకుని ప్రైవేట్ లే అవుట్ నిర్మించి, విక్రయాలు చేసుకున్నారు తప్ప గ్రామస్తుల వెతలను ఏమాత్రం పట్టించుకోలేదు. శ్మశానవాటికకు వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేస్తామని పలుమార్లు మాట ఇచ్చి, తప్పారు.



గెడ్డ తరువాత శ్మశానవాటికకు మూసుకుపోయిన రహదారి

గెడ్డ దాటాలంటే నరకం..

తాటితూరు పరిధిలో ఉన్న శ్మశానవాటికకు మృతదేహాన్ని మోసుకుని దాటాలంటే అష్టకష్టాలు పడాలి. తాళ్లవలస, నమ్మివానిపేట, వలందపేట, పెద్దిపాలెం గ్రామాల నుంచి వస్తున్న మురుగునీటి గెడ్డను దాటడం అత్యంత సాహసమైన పని. నిత్యం దుర్గంధపూరితంగా ఉండే ఈ గెడ్డకు ఇరువైపులా దారి పొడవునా తుప్పలు మొలిచి, విషపురుగులతో నిండి ఉంటుంది. దీంతో పగటి వేళ తప్ప రాత్రి వేళ ఎన్ని లైట్లు వేసుకుని వెళ్లినా చేరుకోవడం కష్టం. గతంలో వలందపేటకు చెందిన చిల్ల శంకర రెడ్డి అనే నేవీ ఉద్యోగి గెడ్డను దాటడానికి మార్గం ఏర్పాటుకు రూ.లక్ష విరాళం ఇవ్వగా పైపులు తెచ్చి గెడ్డ అడుగు భాగం కొంత నిర్మించారు. తరువాత గ్రామస్తుల మధ్య పూర్తి సహకారం లేకపోవడంతో ఆ పనులు అందులో మురిగిపోయాయి. ప్రభుత్వం శ్మశానవాటిక విషయంలో దృష్టి సారించకపోవడంతో గ్రామస్తులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. చందాలు వేసుకునైనా గెడ్డ దాటడానికి మార్గం ఏర్పాటు చేసుకునే దిశగా ఆలోచిస్తున్నారు.

ఏ గ్రామంలోనూ ఇన్ని ఇబ్బందులు ఉండవేమో..



ఏ గ్రామంలో అయినా శ్మశానవాటికకు వెళ్లాలంటే బహుశా మేము పడినన్ని కష్టాలు ఎవరూ పడి ఉండరు. మృతుని ఇంటి వద్ద నుంచి రెండు శ్మశానవాటికలకు వెళ్లే మార్గాలన్నీ ఇబ్బందిగానే ఉంటాయి. గ్రామస్తుల్లోనూ ఐక్యత అవసరం.

– కొనన శ్రీనివాసరెడ్డి, వలందపేట

వసతులు కల్పించలేదు



వలందపేటకు చెందిన రెండు శ్మశానవాటికలలో ఇప్పటి వరకు ఎవరూ వసతులు కల్పించలేదు. ప్రైవేట్ వ్యక్తుల సహకారంతో మేమే కొంతమార్గం ఏర్పాటు చేసుకున్నాం. శ్మశానవాటికలలో షెడ్లు, బోరు, మొక్కలు ముఖ్యంగా గెడ్డపై మార్గం ముఖ్యం. వీటి కోసం శ్రమిస్తాం.

–చిల్ల సూర్యనారాయణరెడ్డి, వలందపేట

శాశ్వతమార్గమే పరిష్కారం



గతంలో గెడ్డపై మార్గం నిర్మించడానికి రూ.లక్ష ఇచ్చాను. రూ.90వేలు ఖర్చయినా ఫలితం మాత్రం రాలేదు. గ్రామంలో ఎవరైనా చనిపోయినప్పుడు శ్మశానవాటికకు వెళ్లాలంటే మార్గాలు నరకకూపంలా ఉంటాయి. గతంలో వైఎస్సార్‌సీపీ చాలావరకు సహాయం అందించింది. ఇప్పుడు మిగిలిన మార్గాలకు మళ్లీ చందాలు వేసుకుని శాశ్వతంగా మార్గం నిర్మించుకోవాలనుకుంటున్నాం.

– చిల్ల శంకరరెడ్డి, వలందపేట

ప్రభుత్వ స్థలం ఆక్రమణ



ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ దరి సుభాష్‌నగర్‌లో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న 60 గజాల ఖాళీ స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించాడు. ఆదివారం రాత్రి ఆ స్థలంలో పునాదులు తవ్వి, నిర్మాణం చేపట్టేందుకు సిద్ధం చేశాడు. సోమవారం తెల్లవారుజామును ఇది చూసిన స్థానికులు సచివాలయంలో ఫిర్యాదు చేశారు. లక్షల్లో విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై తక్షణమే చర్యలు తీసుకుని, ఆ స్థలాన్ని పరిరక్షించాలని రెవెన్యూ అధికారులను కోరారు.

కూటమి ప్రభుత్వంలో ఆడబిడ్డలకు కొరవడిన రక్షణ



బింగి హరికిరణ్‌రెడ్డి

తగరపువలస: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి 10 మాసాలుగా ఆడబిడ్డల మానప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం చిట్టివలసలో మాట్లాడుతూ ఇది కూటమి ప్రభుత్వమా? కామాంధుల ప్రభుత్వమా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయన్నారు. విద్యాసంస్థల ప్రతినిధులే విద్యార్థులపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు. ఇటీవల మధురవాడలో తల్లీకూతుళ్లపై దాడి, విజయనగరం జిల్లాలో 12 ఏళ్ల బాలికపై కత్తితో దాడి, సత్తెనపల్లిలో దళిత వర్గానికి చెందిన అంగన్‌వాడీపై టీడీపీ కామాంధుడు బొట్టు వెంకటేశ్వరరావు వెకిలి చేష్టలపై చంద్రబాబు, పవన్ కల్యాణ్ స్పందించకపోవడం శోచనీయమన్నారు. గతంలో మహిళల భద్రతకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశ చట్టాన్ని తీసుకువచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు పాల్పడేవారిపై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు.

పవన్ సమాధానం చెప్పాలి

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాన్వాయ్ కారణంగా జేఈఈ పరీక్షలకు హాజరయ్యే 30 మంది విద్యార్థుల జీవితం అంధకారమయం అయిందని హరికిరణ్ రెడ్డి అన్నారు. పవన్ పర్యటన కారణంగా ట్రాఫిక్ నిలిపివేయడంతో విద్యార్థులు ఆలస్యంగా చేరుకునేసరికి గేట్లు మూసేశారని, పవన్ దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఏడో వార్డులో జెడ్సీ పర్యటన



మురుగునీరు నిలిచిపోయిన చోట కాలనీ మ్యాప్ పరిశీలిస్తున్న జెడ్సీ కనక మహాలక్ష్మి

మధురవాడ: నివాస ప్రాంతాల్లో మురుగునీరు పారుదలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామని జోన్–2 జెడ్సీ కె.కనక మహాలక్ష్మి చెప్పారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఏడో వార్డు మానం ఆంజనేయులు కాలనీ, మల్లయ్యపాలెంలో అధికారులతో కలసి ఆమె సోమవారం పర్యటించారు. మానం ఆంజనేయులు కాలనీలో మురుగునీరు పారే వుడా మాస్టర్ ప్లాన్ రోడ్లను ఆనుకుని ఉన్న కాల్వలను ఓ వ్యక్తి 5చోట్ల మూసేశాడు. దీంతో నెలలు తరబడి మురుగు నీరు నిలిచిపోవడంతో ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు కలెక్టర్‌కు, వీఎంఆర్‌డీఏ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆమె కాలనీలో పర్యటించి కాలనీ వాసుల సమస్యలు తెలుసుకున్నారు. కాలనీ అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్, ప్రతాపరాజు, నాయుడు తదితరులు సమస్యను జెడ్సీకి వివరించి, వినతిపత్రం అందించారు. దీనిపై తక్షణ చర్యలు చేపట్టాలని జెడ్సీ అధికారులను ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్, టీడీపీ నాయకుడు పిళ్లా వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పోలమాంబ ఆలయ గ్రేడ్ తగ్గింపు

- గత ఆర్థిక సంవత్సరంలో తగ్గిన ఆదాయం
- 6ఏ నుంచి 6బీకి మారిన గ్రేడ్

తగరపువలస: సంగివలస పోలమాంబ (ముగ్గురు అమ్మవార్ల) ఆలయం గ్రేడ్‌ను 6ఏ నుంచి 6బీకి తగ్గిస్తూ దేవదాయశాఖ నిర్ణయం తీసుకుంది. గతంలో రూ.50 లక్షల పైచిలుకు నికర ఆదాయం గల ఈ ఆలయం గత ఆర్థిక సంవత్సరంలో రూ.42 లక్షలే ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఆలయాల హుండీ ఆదాయం నెలకు సగటున రూ.3లక్షల నుంచి రూ.4.50 లక్షలు ఉంటుంది. ఏటా శరన్నవరాత్రి ఉత్సవాలు, వార్షిక ఉత్సవాల సమయంలో అదనంగా రూ.1.50 లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. ఇక ఆలయంలో రోజువారీ అర్చన, దర్శనాల టిక్కెట్లు, అన్నదానాలకు విరాళాలు, చీరలు, మొక్కులు చెల్లింపు తదితర ఆదాయం పరిశీలిస్తే 2024 ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు సగటున రోజుకు రూ.300 నుంచి రూ.1500 మధ్య వచ్చేది. ఈ మొత్తాన్ని ఆలయ అర్చకులు ఏ రోజుకు ఆరోజు బ్యాంకు ఖాతాలో జమ చేయాలి. గతేడాది 9 మాసా ల డైలీ ఆదాయం రూ.2.25 లక్షలు వచ్చినట్లు అంచనా.

గతేడాది నవంబరు చివరిలో జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబాకు అదనంగా సంగివలస పోలమాంబ ఆలయ బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన డైలీ ఆదాయంపై దృష్టి సారించారు. దేవదాయశాఖ అనుమతితో ప్రత్యేకంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని ఏర్పాటు చేసి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో ఉండే ఏర్పాటు చేశారు. దీంతో ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు మూడు నెలల్లోనే డైలీ ఆదాయాన్ని రూ.9.50 లక్షలు తీసుకురాగలిగారు. దీనిని బట్టి గతంలో ఇక్కడి పనిచేసిన ఈవోలు కాని, సిబ్బంది కానీ డైలీ ఆదాయం పెంపుపై దృష్టి సారించలేదని తెలుస్తోంది. మళ్లీ వరుసగా మూడేళ్ల ఆదాయం పెరిగితే తప్ప గ్రేడ్ పెరగదని భక్తులు అంటున్నారు.

ఉన్నతాధికారులను ఏమార్చే ప్రయత్నం

ఇటీవల వరకు పోలమాంబ ఆలయంలో పనిచేసిన ఉద్యోగి, ఉన్నతాధికారులను ఏమార్చే ప్రయత్నం చేసినట్టు తెలుస్తోంది. పోలమాంబ ఆలయానికి అనుబంధంగా ఉన్న ఉమారామలింగేశ్వర ఆలయంలో నైవేద్యం కోసం పంపించిన 25 కిలోల బియ్యం ప్రస్తుత ఈవో బాబా సాయంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ప్రకాష్ కాజేసినట్లు ఆరోపిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్లు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయగా అది దురుద్దేశంతో చేసిన ఫిర్యాదుగా తేలినట్టు తెలిసింది. ఆది నుంచి ఆలయ పరిధిలో ఉన్న లంగర్‌ఖానా భూముల ఆక్రమణను గాలికి వదిలేయడమే కాకుండా ఈవోపై బురద చల్లే ప్రయత్నం చేసినట్టు పలువురు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి ఈవోగా బాబా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచే డైలీ ఆదాయం గణనీయంగా పెంచారని, అంతకు ముందు ఆదాయం లేక సిబ్బందికి నిలిచిపోయిన ఆరు నెలల జీతాలలో అర్చకులకు 6 నెలలు, స్వీపర్లు, వంటవాళ్లు, కాపలావానికి 3 నెలల బకాయిలు చెల్లించినట్టు సిబ్బంది తెలిపారు. దేవాలయ ఆధీనంలో ఉన్న అంగుళం భూమి కూడా కబ్జాదారుల చేతిలో పడకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



సంగివలస పోలమాంబ ఆలయం

రోడ్డుపై ఆక్రమణలను తొలగించండి

- 78ఏళ్ల మహిళతో పాటు కాలనీవాసుల వినతి
- టౌన్ ప్లానింగ్ నిర్లక్ష్యంపై జెడ్సీ ఆగ్రహం
- జోన్–2 పీజీఆర్‌ఎస్‌లో 10 అర్జీలు



ఎండాడ రహదారిలో ఆక్రమణలు తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్న 78ఏళ్ల కమల



వైన్‌షాపు వల్ల ఇబ్బందులపై ఫిర్యాదు ఇస్తున్న మిథిలాకాలనీ అధ్యక్షుడు వెంకటరమణ

మధురవాడ: ఎండాడ హైవేకు అనుసంధానంగా స్కైలైన్ ఎదురుగా సర్వే నంబరు 10లో ఉన్న బిర్యానీ షాపునకు సెట్ బ్యాకులు లేకుండా 3 అడుగుల మేర రోడ్డుపైకి రేకులు షెడ్ ఏర్పాటు చేశారని పీజీఆర్‌ఎస్‌లో జెడ్సీకి ఫిర్యాదు చేశారు. దీనివల్ల అసలే 20 అడుగులే ఉన్న రోడ్డు మరింత కుదించుకుపోయిందని, రాకపోకలకు ఇబ్బంది కలుగుతున్నందున ఆక్రమణలు తొలగించాలని కమల అనే 78 ఏళ్ల వృద్ధురాలు, స్థానికుడు శ్రీరామ్మూర్తి తదితరులు వినతిపత్రం సమర్పించారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో వారు సమస్యను వివరించారు.

- రుషికొండ 8వ వార్డు ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన వాణిజ్య సముదాయాలకు అనుమతుల్లేవని, పైగా ప్రభుత్వ స్థలం కూడా ఆక్రమణకు గురైందని ఫిషర్‌మెన్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ తెడ్డు శంకరరావు ఫిర్యాదు చేశారు. వీటి నిర్వహణలో హైకోర్టు ఆదేశాలు అమలు చేయాలని కోరారు.
- కొమ్మాది జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారం నిర్మాణాలు చేసేస్తున్నారని జి.నీలవేణి అనే మహిళ ఫిర్యాదు చేశారు. చర్యలు చేపట్టాలని కోరారు. దీంతో జెడ్సీ టౌన్‌ప్లానింగ్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత నిర్లక్ష్యం ఏమిటని ప్రశ్నించారు.
- మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ మాస్టర్ ప్లాన్ రోడ్డులోని వైన్‌మార్ట్ పరిసరాల్లో బహిరంగ మద్యపానంపై మధురవాడ మిథిలాపురి వుడాకాలనీ శ్రీ సాయి రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మగ్గూరి వెంకటరావు ఫిర్యాదు చేశారు. దీంతో కాలనీవాసులు, మహిళలు ఇబ్బంది పడుతున్నారని, చర్యలు తీసుకోవాలని కోరారు.

.. ఇలా జోన్ పరిధిలో 10 అర్జీలు అందాయి. వాటిలో 3 టౌనింగ్ విభాగానివే. పీజీఆర్‌ఎస్‌కు హెల్త్ ఆఫీసర్, ఆర్‌వో, ఏసీపీ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తదితర విభాగాల హెచ్‌వోడీలు డుమ్మా కొట్టారు. ఫిర్యాదులపై తక్షణ చర్యలు చేపడతామని జెడ్సీ కనకమహాలక్ష్మి తెలిపారు.

జోన్–1లో ఐదు వినతులు

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద సోమవారం జెడ్సీ ప్రేమ ప్రసన్నవాణి ఆధ్వర్యంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు ఐదు వినతులు వచ్చాయి. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి మూడు వినతులు, ఇంజినీరింగ్, యూసీడీ విభాగాలకు ఒక్కొక్క వినతి వచ్చాయి. వీటిని పరిశీలించి పరిష్కరిస్తామని జెడ్సీ తెలిపారు.

నిలిచిన విద్యుత్ సరఫరా

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సాంకేతిక కారణాలతో సోమవారం సాయంత్రం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. జంపర్ తెగిపోవడంతో సుమారు గంట విద్యుత్ నిలిచిపోయింది. ఏఈఈ బొట్ట రవి సకాలంలో స్పందించి విద్యుత్ సరఫరాను సిబ్బంది సాయంతో పునరుద్ధరించారు.

శ్రీవిద్యాశక్తి పీఠం ప్రథమ వార్షికోత్సవం నేడు

తగరపువలస: భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ కీతిన్‌పేటలోని శ్రీవిద్యాశక్తి పీఠం ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, అర్చనలతో పాటు లలిత సహస్ర పారాయణం, హోమాలు నిర్వహించనున్నట్టు పీఠం వ్యవస్థాపకుడు సోమయాజుల కల్యాణ చక్రవర్తి తెలిపారు.

పోలీసులకు సత్కారం



ఎస్‌ఐ భాస్కరరావును అభినందిస్తున్న పౌర సంక్షేమ సంఘం నాయకులు

మధురవాడ: ప్రాణాపాయం నుంచి వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు మహిళలను కాపాడిన పీఎం పాలెం ఎస్‌ఐ కాళ్ల భాస్కరరావును, హెడ్ కానిస్టేబుల్ విజయ్‌ను.. అలాగే సీఐ బాలకృష్ణను మధురవాడ పౌర సంక్షేమ సంఘం నాయకులు సత్కరించారు. పోలీస్ స్టేషన్‌లో సోమవారం వారిని కలసి శాలువాలతో సత్కరించి, అభినందించారు. వారు మాట్లాడుతూ మధురవాడలో ప్రేమోన్మాది దాడిలో గాయపడిన దీపికను సకాలంలో ద్విచక్రవాహనంపైనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారన్నారు. అలాగే వైఎస్సార్ కాలనీలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మరో మహిళను చాకచక్యంగా కాపాడారన్నారు. కార్యక్రమంలో పౌర సంక్షేమ సంఘం నాయకులు జగన్మోహన్ చౌదరి, ఎస్వీ రమణ, మామిడి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు 653 మంది హాజరు



ఆనందపురం ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు

తగరపువలస: ఆనందపురం మండలంలో కార్పొరేషన్ రుణాల కోసం ఈ నెల 4,7 తేదీల్లో జరిగిన ఇంటర్వ్యూలకు 653 మంది హాజరయ్యారని ఎంపీడీవో వి.జానకి తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా మొత్తం 848 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి బి.సత్యనారాయణ, ఏపీజీబీవీ, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంకు, ఇండియన్ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై సీపీఎం ఆందోళన



మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగారావు

భీమునిపట్నం: భీమిలి పరిధిలో సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ గంగారావు డిమాండ్ చేశారు. భీమిలి జోనల్ కార్యాలయం వద్ద సీపీఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. అర్హులకు ఇళ్ల కేటాయింపు, నీటి సమస్య, రోడ్డు నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలన్నారు. జనావాసాల మధ్య సెల్‌టవర్ ఏర్పాటు ఆపాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జోన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి, నాయకులు ఎస్.అప్పలనాయుడు, రవ్వ నర్సింగరావు, పంపాన సూర్యనారాయణ, చిన్నారావు, శ్రీను పాల్గొన్నారు.